

బదిలీ ఎంఇఒకు సన్మానం



నాగేశ్వరరావును సత్కరిస్తున్న విద్యాశాఖ సిబ్బంది

డుంబ్రిగుడ: మండలంలో రెండవ ఎంఇఒగా పనిచేస్తూ బదిలీపై వెళ్లిన బిబి నాగేశ్వరరావుకు స్థానిక మండల కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఇఒ సుందర్రావు మాట్లాడుతూ మండలంలో ఏ విధంగా విధి నిర్వహించారో, కొత్తస్థానం అనంతగిరి మండలంలోనూ ప్రజల మన్ననలు పొందేలా సేవలు అందించాలని, విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలోఎంఇఒ 2 జి గెన్ను , విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఏవీ మినీ రేషన్ పాయింట్లు?

- అమలుకు నోచుకోని పౌరసరఫరాల మంత్రి హామీ
- రేషన్ సరుకులకు గిరిజనానికి తప్పని అగచాట్లు



అవస్థలు పడుతూ రేషన్ తెచ్చుకుంటున్న గిరిజనులు

ప్రజాశక్తి -అనంతగిరి : మినీ రేషన్ పాయింట్లు ఏర్పాటుతో మన్యవాసుల రేషన్ కష్టాలకు విముక్తి కల్పిస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి హామీ, ఆదేశాలు నేటికీ అమలుకు నోచుకోలేదు. దీంతో మారుమూల గ్రామాలకు చెందిన గిరిజనులు సుదూరాన ఉన్న డిపోల నుంచి రేషన్ సరుకులు తెచ్చుకునేందుకు నానా అగచాట్లు పడక తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎండిఎం వాహనాలను రద్దుచేసి, డిపోల్లోనే రేషన్ సరుకులు పంపిణీ చేయాలన్న కూటమి ప్రభుత్వంతో మన్యంలో రేషన్ కష్టాలు తీవ్రమయ్యాయి. మారుమూల గ్రామాల నుంచి గిరిజనులు పదుల కిలోమీటర్ల దూరంలో ఉన్న డిపోలకు వెళ్లి రేషన్ తెచ్చుకోవడం ఇబ్బందిగా మారింది. దీనిపై ఏజెన్సీవాసుల నుంచి వచ్చిన అభ్యర్థన మేరకు నెలరోజుల క్రితం. అల్లూరి జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల. మనోహర్ స్థానిక హరిత హిల్ రిసార్ట్లో జిల్లా, మండలస్థాయి పౌరసరఫరాల విభాగం అధికారులతో నిర్వహించిన సమీక్షలో గిరిజనుల రేషన్ కష్టాలపై స్పందించి, మినీ రేషన్ పాయింట్ ఏర్పాటుకు ఆదేశించారు. అయితే నెలరోజులు గడిచినా వీటి ఏర్పాటుకు సంబంధించి ప్రక్రియ ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడంతో ఈనెల రేషన్ను యథావిధిగా ఇబ్బందులు పడుతూ గిరిజనులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దూరాన ఉన్న డిపోల నుంచి రేషన్ బియ్యం విడిపించి, తలపై మూటలను మోస్తూ కాలినడకన వారు వస్తున్న దుస్థితిని చూసి కడుపు తరుక్కుపోతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నా, హామీ ఇచ్చిన నేతల్లోగానీ, అమలు చేయాల్సిన అధికారుల్లోగానీ ఇసుమంతైనా కనికరం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇప్పటికైనా మండల రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల అధికారులు గుర్తించిన ఇ-రేషన్ పాయింట్లో పిన్నకోట డిఆర్ డిపో పరిధి బొర్రాపాలెం రేషన్ పాయింట్లో 188 రేషన్ లబ్ధిదారులు చింతపాక డిపో పరిధిలో. వనిజలో 180మంది, భీంపోలు డిపో పరిధి నేరడవలస రేషన్ పాయింట్లో 30 మంది, పాతకోట మినీ డిపో పరిధిరేగం రేషన్ పాయింట్లో 78 మంది, చిలకలగెడ్డ డిపో. కత్తూరు రేషన్ పాయింట్లో 56 మంది, డీకేపర్తి డిపో పెద్దకోనెల రేషన్ పాయింట్లులో 273 మంది, రొంపల్లి డిపో ఆర్టీ పురం రేషన్ పాయింట్లో 30 రేషన్ లబ్ధిదారులు ఉన్నారని, వారికి మినీ రేషన్ పాయింట్ల ద్వారా రేషన్ సరఫరాకు అధికారులు గుర్తించినా అమలు చేయకపోవడంపై ఆందోళన వ్యక్తమౌతోంది. ఇప్పటికైనా తగు చర్యలు చేపట్టాలని లబ్ధిదారులు కోరుతున్నారు. దీనిపై మండల పౌరసరఫరాల విభాగం డిటి మాణిక్యం వివరణ కోరగా రేషన్ పాయింట్లు గుర్తించామని, ఆయా పాయింట్ల ద్వారా సరుకులు సరఫరా చేయాల్సి ఉందన్నారు. ప్రస్తుతానికి బొర్రాపాలెం పాయింట్ ద్వారా మాత్రమే రేషన్ పంపిణీ జరుగుతోందని, ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే మిగతా పాయింట్లలోనూ పంపిణీకి చర్యలు చేపడతామన్నారు.

వైద్యసేవల్లో సమయపాలన పాటించాలి



డాక్టర్లతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: సమయపాలన పాటించి సకాలంలో విధులకు హాజరై, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్ సూచించారు.. బుధవారం పాడేరు ప్రభుత్వ ఆసుపత్రిని డిఎంహెచ్ఒ డాక్టర్ విశ్వేశ్వర నాయుడుతో కలసి సందర్శించారు. రోగుల వార్డులు, క్యాజువాలిటీ, అత్యవసర కేసులు వార్డులు, సర్జికల్, గైనిక్ విభాగాలను పరిశీలించారు. ల్యాబ్, ఎక్స్రే, స్కాన్ సెంటర్ల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో రికార్డులు పరిశీలించారు. రెఫరల్ సర్వీస్, అంబులెన్స్ సేవలపై ఆరాతీశారు. . ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత అవసరమన్నారు కార్యక్రమంలో వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. హేమలతా దేవి, గైనకాలజిస్ట్ డాక్టర్ నరసింగరావు, ఆయా విభాగల హెచ్ఒడిలు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- సిఐటియు ఆధ్వర్యాన ఆటో కార్మికుల నిరసన



ర్యాలీ చేస్తున్న ఆటో కార్మికులు

ప్రజాశక్తి -పాడేరు : ఆటో కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు డిమాండ్ చేస్తోంది. బుధవారం పాడేరులో పాడేరు ఆర్టిసి కాంప్లెక్స్ నుండి పాత బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వీరికి సిఐటియు నేతలు సంఘీభావం తెలిపారు.

ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వర రావు, జిల్లా సహాయ కార్యదర్శి ఎల్ సుందరరావు మాట్లాడుతూ తెలుగుదేశం .కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలులో భాగంగా మహిళలకు ఆర్టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆటో కార్మికులు జీవనోపాధి కోల్పోయి రోడ్డును పడ్డారని ఆవేదన వెలిబుచ్చారు. స్త్రీశక్తి పథకానికి వ్యతిరేకం కాకపోయినా, దీని ప్రభావంతో జీవనోపాధి భారమైన ఆటో కార్మికులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అధిక వడ్డీలకు ప్రయివేటు ఫైనాన్స్ల వద్ద అప్పులు చేసి, ఆటోలను కొనుక్కుని నెలసరి రుణ వాయిదాలను తీరుస్తున్న ఆటో డ్రైవర్లు, ఇపుడు ఉపాధి భారమై ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆటో కార్మికులకు సంవత్సరానికి వాహన మిత్ర క్రింద రూ.25వేలు భృతి చెల్లించాలని, ఆటో కొనుగోలుకు రూ.ఐదు లక్షల వరకు బ్యాంకుల ద్వారా వడ్డీలేని రాయితీ రుణం చెల్లించాలన్నారు. తక్షణం ఆటో కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసి ఆటో కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు కష్టారావు, అధ్యక్షులు జె. సంజీవరావు,కార్యదర్శి ,మాజీ అధ్యక్షులు ప్రసాద్, సుందరరావు, వెంకటరావు, బాలు, సురేష్, కిరణ్, అనిల్, సాయి, దాసు, నాగరాజు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

పటిష్ట ప్రణాళికలతో జిసిసి

- సరికొత్త లోగో ఆవిష్కరణ
- నాణ్యతకు ప్రాధాన్యమిస్తూ.. ఆకర్షణీయ పద్ధతుల్లో జనం ముందుకు..
- అరకు కాఫీకి మరింత ప్రాధాన్యం
- 'ప్రజాశక్తి'తో జిసిసి ఎమ్డి కల్పనా కుమారి



గిరిజన సహకార సంస్థ ఉత్పత్తులు



ప్రజాశక్తి - విశాఖపట్నం

గిరిజన సహకార సంస్థ (జిసిసి) పటిష్ట ప్రణాళికలతో ముందుకెళ్తున్నట్టు సంస్థ ఉపాధ్యక్షులు, మేనేజింగ్ డైరెక్టర్ కల్పనా కుమారి తెలిపారు. తనను కలిసిన 'ప్రజాశక్తి'తో ఆమె పలు విషయాలపై ముచ్చటించారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతులమీదుగా సరికొత్త లోగోను ఆవిష్కరించినట్టు తెలిపారు. ఇప్పటి వరకూ మార్కెట్లో చలామణిలో ఉన్న తమ ఉత్పత్తులకు సరికొత్త అంతర్జాతీయ బ్రాండ్ ఇమేజ్ తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. అన్ని ప్రొడక్ట్ తాలూకా బాటిల్స్, ప్యాకింగ్స్, లేబుల్స్ను ఆకర్షణీయంగా, వినియోగదారుల మనసులను దోచేకునే విధంగా తీర్చిదిద్దామన్నారు. సరికొత్తగా మార్కెట్లోకి వస్తున్నట్టు తెలిపారు. అరకు కాఫీ, ఇతర అంశాలపైనా ఆమె పలు వివరాలు వెల్లడించారు. అవి ఆమె మాటల్లోనే..

అరకు కాఫీ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

అంతర్జాతీయ ప్రమాణాలతో ఆర్గానిక్ సర్టిఫికెట్ను అరకు కాఫీ పొందింది. ఇదెంతో గర్వకారణం. తూర్పు కనుమలు అడవులలో గిరిజనులచే సంప్రదాయంగా పండించే ఈ కాఫీకి ఎంతో ప్రతిష్ట ఉంది. ఎటువంటి ఎరువులూ ఉపయోగించకుండా సాగుచేసే ఈ ఆర్గానిక్ కాఫీకి మంచి డిమాండ్ ఉంది. వివిధ పరిణామాల్లో ప్యాక్ చేస్తూ, ఇనిస్టెంట్ పౌడర్నూ అందిస్తున్నాం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో టాటా గ్రూప్ ప్రతినిధులతో అంతర్జాతీయ మార్కెట్లోకి కాఫీని తీసుకెళ్లేందుకు ఒప్పందం కుదిరింది.

ఇతర ఉత్పత్తుల గురించి తెలియజేస్తారా ?

పసుపు, మిరప పొడులతో పాటు జీడిపప్పు, గిరిజన ప్రాంతాల్లో దొరికే సహజసిద్ధమైన, నాణ్యమైన తేనె, నేచురల్ డ్రింక్స్ అయినటువంటి నన్నారి సరబత్, ఆరోగ్యానికి దోహదం చేసే త్రిఫల రసాన్ని సరికొత్త బాటిల్స్లో అందుబాటులోకి తీసుకొచ్చాం. హెర్బల్ లిక్విడ్ ఫ్లోర్ క్లీనర్, హెర్బల్ లిక్విడ్ డిష్వాష్ అందుబాటులో ఉన్నాయి. శరీర సౌందర్య ఉత్పత్తుల్లో అందమైన, నాణ్యమైన టిఎఫ్ఎమ్ 76 శాతం కలిగిన సబ్బులు తయారు చేస్తున్నాం. దీనిలో జాస్మిన్, అలోవెరా, నీమ్ (వేప) టెర్మరిక్ సబ్బులు ఉన్నాయి. 125 గ్రాముల బరువుతో సూపర్ సేవ్ 5 సబ్బులు ప్యాక్ అందుబాటులో ఉంది. దీంతో పాటు సీకాయ్ షాంపు, పౌడర్, కుంకుడుకాయ షాంపు, పౌడర్, ఆమ్లా పౌడర్, హెర్బల్ హెయిర్ ఆయిల్, పెయిన్ రిలీఫ్ ఆయిల్ కూడా ఆకర్షణీయమైన బాటిల్, ప్యాకింగ్లో అందుబాటులో ఉన్నాయి. ఆహార ఉత్పత్తులలో రాజ్మా రెడ్, వైట్, బొబ్బర్లు, అలసందలు, ఎండు మిరపకాయలు, చింతపండు పిక్కతో, పిక్క తీసినది, రాగి పౌడర్ అందుబాటు ధర, పరిమాణాలలో ఉన్నాయి.



గిరి రైతులకు ఎలాంటి ప్రోత్సాహం అందిస్తున్నారు ?

గిరిజన ఉత్పత్తులు జిసిసి కౌంటర్లతోపాటు ట్రైఫెడ్ (ట్రైబల్ కో ఆపరేటివ్ మార్కెటింగ్ డెవలప్మెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్) స్టోర్స్లో అందుబాటులో ఉంటాయి. ఈ ఉత్పత్తులను సేకరించి, అమ్మకం చేసి గిరిజన రైతులలో ఒక విధమైన భరోసా కల్పిస్తున్నాం. రాబోయే మూడేళ్లలో పాడేరు, అరకు ప్రాంతాల్లో ఐటిడిఎ సహకారంతో లక్ష ఎకరాల్లో కాఫీ సాగు చేసే ప్రణాళికలు రూపొందిస్తున్నాం. దీని ద్వారా గిరిజనుల్లో స్వావలంభన సమకూరుతుంది. వారు పండించే ప్రతి ఉత్పత్తిని జిసిసి ద్వారా కొనుగోలు చేసి మార్కెటింగ్ చేస్తాం. ఆ విధంగా గిరిజన రైతులకు ప్రోత్సాహం, భరోసా అందిస్తాం. అంతర్జాతీయ స్థాయిలో అరకు కాఫీ బ్రాండ్ను తీసుకుపోయేందుకు టాటా గ్రూప్తో ఒప్పందం చేసుకున్నాం. దేశీయంగా ఉండే రిటైల్ చైన్ మార్కెట్లో డీమార్ట్, రిలయన్స్ ఫ్రెష్లవారితో సంప్రదింపులు జరిపి ఆయా స్టోర్లలో కూడా జిసిసి ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు కృషి చేస్తున్నాం.

వరద గోదావరి

తగ్గుతూ..పెరుగుతూ..

ముంపు బాధితులకు గోదావరి వరద భయం వీడడం లేదు. తగ్గినట్టే తగ్గి బుధవారం సాయంత్రం నుంచి క్రమేపీ పెరుగుతోంది. దీంతో ముంపు బాధితులు మళ్లీ వరద వస్తుందని ఆందోళన చెందుతున్నారు. కొన్ని గ్రామాల్లో వారు నిత్యావసర వస్తువులు, కిరోసిన్, కూరగాయలు లేక అవస్థలు పడుతున్నారు. రోజుల తరబడి గుట్టలపై వేసుకున్న తాత్కాలిక నివాసాల్లో ఉండలేక అవస్థలు పడుతున్నారు.

- తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరుగుతున్న ప్రవాహం
- ముంపు వాసుల్లో భయాందోళన
- తగ్గని సోకులేరు ఉధృతి
- విఆర్పురం - చింతూరు మండలాలకు వీలుకాని రాకపోకలు
- మళ్లీ వర్షాలు కురుస్తుండడంతో ముంపు భయం



పెరిగిన గోదావరి ప్రవాహం

ప్రజాశక్తి-విఆర్పురం: మళ్లీ గోదావరి, శబరి నదులు పొంగుతున్నాయి. మంగళవారం తగ్గుముఖం పట్టిన గోదావరి బుధవారం ఉదయానికి భద్రాచలం వద్ద 39.3గా ఉన్నా 11 గంటల నుండి మళ్లీ క్రమేపీ పెరుగుతోంది. సాయంత్రం ఐదు గంటలకు భద్రాచలం వద్ద 41గ ఉంది శబరి గోదావరి నదులు రెండు నదుల నుండి వరద వస్తోంది. 20 రోజులుగా రోజులుగా తగ్గుతూ పెరుగుతూ ఉన్న గోదావరి, శబరి నదులు బుధవారం ఉదయం నుండి మళ్లీ పెరగటంతో గ్రామాలు మునిగే ప్రమాదం ఉందని ముంపువాసులు భయపడుతున్నారు, ప్రభుత్వం తక్షణమే ఈ గ్రామాలకు హెల్త్ క్యాంపులు నిర్వహించాలన్నారు. అదేవిధంగా కిరోసిన్, బియ్యం నిత్యావసర సరుకులు అందించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నెల రోజులుగా పనులు లేక ఇబ్బందులు పడుతున్నామని గత ప్రభుత్వంలో గ్రామాలు వరద తాకగానే 2 వేల రూపాయలు ఇచ్చారని, నెల రోజులుగా వరదలతో సతమతమవుతున్నా మాకు ఈ ప్రభుత్వం ఇంతవరకు నష్టపరిహారం ప్రకటించలేదని వారు ఎద్దేవా చేశారు. ఆర్ అండ్ సర్వేలనీ, షాప్స్ సర్వేలని పేరు చెప్పి మమ్మల్ని మభ్యపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని వరద బాధితులు డిమాండ్ చేశారు.



మట్టిగూడెం- ఒడ్డుగూడెం కాలనీ మధ్యలో రహదారిపై వరద నీరు

చింతూరు : మండలంలోని కొయ్యూరు వద్ద వరద నీరు తగ్గడంతో జాతీయ రహదారి 326 బయటపడింది. దీంతో ఒడిస్సా ఆంధ్రాకు రవాణా సౌకర్యం యధావిధిగా కొనసాగుతోంది. సోకులేరు వాగు వద్ద ఇంకా వరద నీరు తగ్గకపోవడంతో చింతూరు విఆర్పురం మండలాలకు రాకపోకలు లేవు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం బుధవారం సాయంత్రం నాటికి 41.40 అడుగులకు చేరింది. దిగువకు 8,28,701 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. చింతూరు వద్ద శబరి నది నీటిమట్టం 29 అడుగులకు చేరింది. బుధవారం చింతూరు సంత కావడంతో ప్రజలు సంతకు అంతగా రాలేకపోయారు. చుట్టూ వాగులు ఉండటంతో మండల కేంద్రానికి చేరుకోవడానికి ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో సంతకు రాకపోవడంతో బుధవారం సంత వెలవెలబోయింది. రహదారులు బురదమయంగా మారాయి. దుకాణదారులు ఆరుబయట విక్రయించేందుకు ఇబ్బంది పడ్డారు.

సిఐటియు మహాసభలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి. నాగేశ్వరరావు

ప్రజాశక్తి - రంపచోడవరం : డిసెంబర్ 31 నుండి జనవరి 4వ తేదీ వరకు జరిగే సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు పిలుపు నిచ్చారు. బుధవారం రంపచోడవరం యుటిఎఫ్ కార్యాలయంలో జరిగిన జిల్లా విస్తతస్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులపైన నిర్బంధాలను కేంద్రంలో ఉన్న ఎన్డిఎ కూటమి ప్రయోగి స్తోందని కార్మికుల హక్కులు చట్టాలను కాలరాస్తూ కార్మికులను బానిసలుగా తయారు చేసే విధానాలను తీసుకొస్తోందని విమర్శించారు. భవిష్యత్తులో కార్మికులు, రైతులు వ్యవసాయ కార్మికులతో కలిపి ఐక్యపోరాటాలు నిర్మించేందుకు విశాఖ నగరంగా జాతీయ మహాసభలు నిర్వహించబోతున్నామని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఎన్డిఎ కూటమికి వత్తాసు పలుకుతోందని తెలిపారు. అఖిలభారత మహాసభల జయప్రదానికి ప్రతి ఒక్క కార్మికుడు పూనుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వెంకట్, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు కిరణ్, సిఐటియు జిల్లా అధ్యక్షులు వాణిశ్రీ, నాయకులు రామరాజు, నిర్మల, రామలక్ష్మి, సీతారామయ్య, ఐ వి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



విత్తనాలు అందిస్తున్న ఎఒ గిరిబాబు

రాజ్మా విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-జికె వీధి: రైతులకు ప్రభుత్వం అందిస్తున్న 90 శాతం సబ్సిడీతో రాజ్మా విత్తనాలను మండలంలోని రింతాడ సచివాలయం1లో మండల వ్యవసాయాధికారి గిరిబాబు, ఉపసర్పంచ్ సోమేశ్ కుమార్, కూటమి నాయకుల ఆధ్వర్యంలో రాజ్మా చిక్కుడు విత్తనాలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. రైతు సేవా కేంద్రాల్లో 90 శాతం సబ్సిడీతో విత్తనాలు అందిస్తున్నామని రైతులు సద్వినియోగం చేసుకుని వర్షాభావ పరిస్థితులు అనుకూలించినప్పుడు వాటిని గరువులలో విత్తుకోవాలని రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు, వైసిపి నాయకులు, పీసా కమిటీ రైతులు పాల్గొన్నారు.

వైసిపి పంచాయతీ కమిటీల ఎన్నిక

ప్రజాశక్తి - జికె వీధి : గూడెం కొత్తవీధి పంచాయతీ కేంద్రంలో వైసిపి పార్టీ బలోపేతానికై నూతన పంచాయతీ కమిటీలు ఏర్పాటు చేయడం జరిగింది. సర్పంచ్ కొర్రసుభద్ర, మండల అధ్యక్షులు కంకిపాటి గిరిప్రసాద్ అధ్యక్షతన బుధవారం కమిటీ ఎన్నికలు నిర్వహించారు. పంచాయతీ అధ్యక్షులుగా కొర్ర నూకరాజు, ప్రధాన కార్యదర్శులుగా గొల్లూరి సుబ్బారావు, కొర్ర దేవదాసు, కొర్ర శాంతిరాజు కార్యదర్శులుగా కిలో పరమేశ్వరరావు, మామిడి వెంకటరావు, జుంబు రాజారావు, మామిడి భీమారావు, పొత్తూరి ప్రసాద్, రైతు విభాగం అధ్యక్షులుగా కొర్ర రాంబాబు ప్రధాన కార్యదర్శులుగా వంతల రాంబాబు, గెమ్మెలపెద్ద కొండబాబు, గుంజా నాగేశ్వరరావు, వంతల జగత్రావు,యూత్ విభాగం అధ్యక్షులుగా కోరాబు శ్రీను, ప్రధాన కార్యదర్శి కొర్ర సిమోన్ , కర్ర త్రినాథ్, వంతల రమేష్, మహిళా విభాగం అధ్యక్షులుగా దురుచంటి, ప్రధాన కార్యదర్శులుగా కొర్ర చిలకమ్మ, వంతల చిన్నమ్మి, కొర్ర చిన్నమ్మి, క్రిస్టియన్ విభాగం అధ్యక్షులుగా పాస్టర్ కుర్ర జాషువాను నియమించారు.



ఎన్నుకోబడిన నూతన కమిటి

రంగురాళ్లు తవ్వితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - రంపచోడవరం : ఏజెన్సీలో అనుమతులు లేకుండా ఎక్కడైనా రంగురాళ్ల తవ్వకాలు నిర్వహిస్తే వారిపై కేసులు పెడతామని రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం హెచ్చరించారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ ఏజెన్సీలో ఎక్కడైనా రంగురాళ్ల తవ్వకాలు చేస్తే కేసులు నమోదు చేయాలని సబ్ కలెక్టర్ సబ్ డివిజనల్ పోలీస్ అధికారిని ఆదేశించామన్నారు. వీటితో పాటు మెటల్ క్వారీ నిర్వహణ కూడా అనుమతులు లేకుండా నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇళ్ల నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలపరిశీలన చేస్తున్న తహశీల్దార్

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండల తహశీల్దార్ అన్నాజీరావు సీలేరు దారకొండ పంచాయతీ తోకరాయి గాలికొండ పంచాయతీ చట్రాపల్లిలో బుధవారం విస్తృతంగా పర్యటించారు. గత ఏడాది సెప్టెంబర్ 8న వరదలకు తోకరాయి, చట్రాపల్లి గ్రామాల్లో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు పక్కా ఇళ్లు నిర్మించడానికి స్థలపరిశీలన చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ అన్నాజీరావు 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ దినేష్కుమార్ ఆదేశాల మేరకు వరదలో ఇల్లు కోల్పోయిన గిరిజనులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం మోడల్కాలనీ నిర్మించడానికి అనువైన ప్రదేశాన్ని పరిశీలించడం జరిగిందన్నారు. తోకరాయి గ్రామంలో 67 చట్రాపల్లి గ్రామంలో 37 ఇళ్ల నిర్మాణానికి అంచనా వేశామన్నారు. ప్రతి ఒక్కరికి మూడు సెంట్లు తగ్గకుండా ప్రభుత్వ కలెక్టర్కి నివేదిక అందజేస్తామని తెలిపారు. హౌసింగ్ ఎఇ సూర్య, ఇరిగేషన్ ఎఇ నాగమణి, ఆర్ఐ విఆర్ఓ పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసరాలు అందించండి



తహశీల్దార్కి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కూనవరం: శివాలయం వీధిలోని వరదలకు గురైన పలువురికి ఆర్థికంగా ఆదుకోలేదని, నిత్యావసర సరుకులు అందించలేదని తక్షణమే సహాయం అందించాలని సిపిఎం మండల కార్యదర్శి బాబుబొర్రయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక శివాలయం వీధి నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ శ్రీనివాసరావుకి వినతిపత్రం అందజేశారు. వరదలు వచ్చి 15 రోజులుగా జలదిగ్బంధంలో ఉండి ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం నుండి కనీసం ఎటువంటి సాయం అందలేదన్నారు. మే, జూన్లో జరిగిన సమావేశాల్లో మాత్రం అన్ని సౌకర్యాలతో కూడినటు వంటి రిలీఫ్ సెంటర్లు, నిత్యావసర సరుకులు బఫర్స్టాక్ స్టోరేజీలు ఏర్పాటు చేస్తామని చెప్పినా కనీసం ముంపు గ్రామాల బాధితులను పరామర్శించలేదని తక్షణమే ప్రభుత్వం స్పందించి బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు తలగాని నాగరాజు, మండల కమిటి సభ్యులు తాళ్ళూరి శ్రీనివాసరావు, తెల్లం తమ్మయ్య, శాఖ కార్యదర్శి కొండ ఈశ్వర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

1/70 చట్టం పటిష్ట అమలుకు చర్యలు

ప్రజాశక్తి - రంపచోడవరం : గిరిజన ప్రాంతంలో 1/70 చట్టం పక్కాగా అమ లు చేసే విధంగా చర్యలు తీసుకోనున్నట్టు ఈ నెల ఆరో తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరిస్తామని పిఒ కట్టా సింహాచలం పేర్కొన్నారు. ఐటిడిఎ కార్యాలయంలో ఈ మేరకు 1/70 చట్టంపై దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

'గిరిజన చట్టాల ఉల్లంఘన సరికాదు'

ప్రజాశక్తి- హుకుంపేట :గిరిజనుల అభీష్టానికి వ్యతిరేకంగా మన్యంలో హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణం ఏజెన్సీ చట్టాల ఉల్లంఘన కిందే వస్తుందని, దీనిపై పోరాటం చేస్తామని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షురాలు నోగిలి చంద్రకళ హెచ్చరించారు. మండలంలోని బూర్జ పంచాయతీ మజ్జివలసలో గిరిజన చట్టాలు, రాజ్యాంగ హక్కులను ఉల్లంఘిస్తూ హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణానికి అదానీ, నవయుగ వంటి కార్పొరేట్ కంపెనీలకు భూములు కేటాయించడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదన్నారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో గిరిజన చట్టాలను తుంగలో తొక్కి నిర్మాణాలు చేపడితే పోరాడతామని చంద్రకళ స్పష్టం చేశారు. ఏజెన్సీలోని ఐదో షెడ్యూల్ ప్రాంతంలో రాజ్యాంగ హక్కులను, పీసా, అటవీ హక్కుల చట్టం, 1/70 చట్టాన్ని ఉల్లంఘిస్తూ వేల ఎకరాల అటవీ, జిరాయితీ భూములను ప్రైవేట్ కంపెనీలకు కేటాయించడాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఆదివాసీలకు హాని కలిగించే చర్యలను ప్రభుత్వాలు విడనాడాలని డిమాండ్ చేశారు.



ఆర్‌టిసి డిఎంగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులోని ఆర్‌టిసి డిపో మేనేజర్‌గా పి శ్రీనివాసరావు బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ డిపో మేనేజర్‌గా పనిచేసిన ఉమామహేశ్వర రెడ్డి విశాఖపట్నం మద్దిలపాలెం డిపోకు బదిలీ అయ్యారు

ఎస్‌టిల అభ్యున్నతికి కృషి చేస్తా

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఎస్‌టిల అభ్యున్నతికి, టిడిపి బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ సభ్యులు కిల్లో సాయిరాం అన్నారు. బుధవారం విశాఖలో తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో కష్టించి పనిచేసే వారికి పార్టీలో గుర్తింపుతోపాటు పదవులు దక్కుతాయని, బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ఎస్‌టి కమిషన్ సభ్యుడు కిల్లో సాయిరాం మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రిచంద్రబాబు, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతగా సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు వంతల డేవిడ్, క్లస్టర్ ఇంచార్జ్ ధనయికి రమేష్, చట్టి అప్పలరాజు, బూత్ ఇంచార్జ్ కామేష్, నిర్మల లక్ష్మణ్, ఆనంద్, నరేంద్ర, బుజ్జిబాబు పాల్గొన్నారు.

వైభవంగా వినాయకుని నిమజ్జనం


ప్రజాశక్తి-చింతపల్లి : మండలంలోని అంతర్ల కొత్తవీధి గ్రామంలో గణనాథుని నిమజ్జనోత్సవం వైభవంగా జరిగింది. గత నెల 27న ప్రతిష్టించిన గణనాథుడికి ఎనిమిది రోజుల పాటు పూజలు నిర్వహించారు. బుధవారం జరిగిన నిమజ్జనం సందర్భంగా గ్రామ వీధుల గుండా గణనాథుని విగ్రహాన్ని డప్పు వాద్యాలు, నృత్యాలతో ఘనంగా ఊరేగించారు. మహిళలు సంప్రదాయ వేషధారణలో ఉత్సాహంగా పాల్గొనగా, యువకులు బృందాలుగా నృత్యాలు చేసి సందడి చేశారు. ఈ సందర్భంగా గణనాథుని వద్ద ఏర్పాటు చేసిన రెండు లడ్డూలకు వేలం పాట నిర్వహించగా, ఊలం జస్వంత్ పడాల్, సత్యనారాయణ, రమకుమారి కుటుంబ సభ్యులు ఒక లడ్డూను రూ.10,100కు దక్కించుకోగా, మరో లడ్డూను కవడం సోమరాజు, కాంతకుమారి దంపతులు రూ.3,500కు కైవసం చేసుకున్నారు. అనంతరం భక్తులకు ఆ ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

రాజ్‌మా విత్తనాలు పంపిణీకి సిద్ధం

ప్రజాశక్తి -అనంతగిరి : గిరిజన రైతులకు ప్రభుత్వం ద్వారా 90 శాతం రాయితీపై పంపిణీక రాజ్‌మా విత్తనాలు రైతుసేవా కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి రంగారావు అన్నారు. బుధవారం ప్రజాశక్తి విలేకరితో మాట్లాడుతూ అనంతగిరి పంచాయతీకి 22 క్వింటాలు, బొర్రా పంచాయతీకి 42 క్వింటాళ్లు,. టోకూరు, పైనంపాడు, వాలసి, కొండిభ పంచాయతీలకు చెరో 22 క్వింటాళ్లు పెద్దబిడ్డ పంచాయతీకి 33, ఎగుశోభకు 32 క్వింటాళ్లు చొప్పున మొత్తం 213 క్వింటాళ్ల రాజ్‌మా విత్తనాలు ఆయా పంచాయతీల ఆర్‌ఎస్‌కెలలో సిద్ధంగా ఉన్నాయన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు భూమి పట్టా, ఆధార్ జిరాక్స్ కార్డులతో సంప్రదించి పొందవచ్చని సూచించారు.

జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి

జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్ కుమార్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు: జిల్లా అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్‌కుమార్ స్పష్టం చేసారు.బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్సు హాల్లో విద్యాశాఖ, వైద్య ఆరోగ్య శాఖ, ట్రైబల్ వెల్ఫేర్, స్కిల్ డెవలప్మెంట్, ఫుడ్ సేఫ్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖలతో అభివృద్ధి సమీక్షా సమావేశం నిర్వహించారు. విద్యాశాఖ, ఇంటర్మీడియేట్, సమగ్ర శిక్ష అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రాపౌట్లను గుర్తించి పాఠశాలలో చేర్పించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌కు మండల విద్యాశాఖాధికారులు పూర్తిస్థాయిలో హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్థాయిలో పర్యటించి రానున్న 15 రోజుల్లో పాఠశాలల్లో విద్యార్థులను భర్తీ చేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఆధార్ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. నేటికీ తల్లికి వందనం డబ్బులు పడని వారి సమస్యలు పరిశీలించి, డేటా సరి చేసి తల్లికి వందనం పడేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇంటర్మీడియట్ విద్యకు సంబంధించి లెక్చరర్లు స్టేటస్, ఫలితాల శాతంపై ఆరాతీశారు. ప్రభుత్వం నిర్దేశించిన పురోగతి లక్ష్యాలను అధిగమించాలన్నారు. విద్యారంగంలో పురోగతి సాధించాలన్నారు. విద్యా సంస్థలకు తాగునీరు, విద్యుత్తు, అదనపు వసతి సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. పాఠశాలల్లో బేస్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, సంబందిత డేటాను సక్రమంగా సంబంధిత పోర్టల్ లో నమోదు చేయాలన్నారు. బాల్య వివాహాల నివారణపై దృష్టి సారించాలని, గర్భవతులు రిజిస్ట్రేషన్ పక్కాగా జరగాలన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖల పనితీరును సమీక్షించి తగు సూచనలు అందజేశారు. అంగన్వాడీలు పనితీరు మరింత మెరుగు పరచాలన్నారు, గ్రామస్థాయిలో సర్వే త్వరితగతిన చేసి విభిన్న ప్రతిభావంతులకు సదరం సర్టిఫికెట్స్ అందించేలాచర్యలు చేపట్టాలన్నారు. అనంతరం వైద్య ఆరోగ్య, స్కిల్ డెవలప్మెంట్, ఫుడ్ సేఫ్టీపై సమీక్షించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె.అభిషేక్ గౌడ్, రంపచోడవరం, చింతూరు ప్రాజెక్ట్ అధికారులు కె.సింహాచలం, అపూర్వ భరత్, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం నొఖ్వాల్, (వర్చువల్), పాడేరు కలెక్టరెట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి డిఎంహెచ్ఒ డాక్టర్ విశ్వేశ్వరనాయుడు, ముఖ్య ప్రణాళికాధికారి పివిఎల్.ప్రసాద్ జిల్లా విద్యాశాఖధికారి పి.బ్రాహ్మజీ, విభిన్న ప్రతిభావంతులు హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు కె.కవిత, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి ఝాన్సీ రామ్ పడాల్, సర్వశిక్ష ఎపిసి డాక్టర్ స్వామి నాయుడు పాల్గొన్నారు.

మహిళా కళాశాల హాస్టళ్ల ప్రహరీ నిర్మించాలి



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్ఐ మండల కార్యదర్శి ఎస్ ఐసుబాబు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్ : అరకులోయ ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల హాస్టల్స్ ప్రహరీ నిర్మాణం చేపట్టాలని ఎస్‌ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం అరకులోయ ఆదివాసి గిరిజన సంఘం భవనంలోవిలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్,,డిగ్రీ కళాశాల హాస్టళ్లకు పూర్తిస్థాయిలో ప్రహరీ లేకపోవడం వలన గిరిజన విద్యార్థినులకు రక్షణ కరువైందని మండిపడ్డారు హాస్టల్ రక్షణ గోడ లేక పశువులు, జంతువులు లోపల ప్రవేశిస్తునాయని, రాత్రిపూట బయట వ్యక్తులు గేట్లోంచి ప్రవేశిస్తుండడంతో విద్యార్థినులు భయభ్రాంతులకు గురౌతున్నారన్నారు. దీనిపై గతంలో ఎన్నో సార్లు ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో అధికారులకు విన్నవించినా ఇంతవరకు స్పందన లేకపోవడం, నిర్లక్ష్యంగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు.

హాస్టళ్లకు ప్రహరీ నిర్మాణంతోపాటు తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని, మెస్‌ఛార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్ఐ మండల కార్యదర్శి ఎస్ ఐసుబాబు,ఎస్‌ఎఫ్ఐ డిగ్రీ కళాశాల కార్యదర్శి టి ప్రేమ్ సాగర్,కళాశాల ఉపాధ్యక్షులు ఎస్ అభి,సహయ కార్యదర్శి ఎం చందు,ఎస్‌ఎఫ్ఐ సహయ కార్యదర్శి ఎస్ మహేష్, పాల్గొన్నారు.

ఎంఇఒగా గెన్ను

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: స్థానిక మండల విద్యాశాఖాధికారి-2గా జి గిన్ను బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు.ఎంపిడిఒ ప్రేమ్ సాగర్, ఎంఇఒ ఎస్ సుందరరావులను కలిసి జాయినింగ్ రిపోర్టు అందజేశారు. కొత్త ఎంఇఒను పాడేరు ఎంఇఒ 2 జాన్, పిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు ఎస్ అప్పలరాజు, శ్రీను, రాజు, ధర్మ, ఉపాధ్యాయులు రమేష్, సత్యనారాయణ, మధు, రాంప్రసాద్, లక్ష్మయ్య, సిఆర్‌పిలు స్వాగతించి అభినందనలు తెలిపారు.

గంజాయి, నాటుసారా దరికి చేరొద్దు

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు : మండలంలోని లక్ష్మీపురం గ్రామ సచివాలయంలో బుధవారం స్థానిక సిపిఎం సర్పంచ్ కొర్రా త్రినాధ్ అధ్యక్షతన గంజాయి, నాటుసారాకు వ్యతిరేకంగా చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొర్రా త్రినాధ్ మాట్లాడుతూ గంజాయి సాగు, అక్రమ రవాణా చట్టరీత్యా నేరమని, దీన్ని నియంత్రించేందుకు ప్రభుత్వం కఠిన చట్టాలను చేసిందన్నారు. దీని ప్రకారం గంజాయి కేసుల్లో పట్టుబడి జైలుకెళితే, ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపు కార్డులు, రేషన్ కార్డుతో సహా రద్దు అవుతాయని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించదన్నారు. కుటుంబాలను, భవిష్యత్‌ను నాశనం చేసే గంజాయి, నాటుసారాకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. అయితే పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం, బుంగపుట్టు, బరడ గ్రామ పంచాయతీల ఆదివాసీ గిరిజన ప్రజలు మూడేళ్ల నుంచి గంజాయి సాగుకు దూరంగా ఉన్నప్పటికీ, ప్రభుత్వ అధికారులు నిందలు మోపడం బాధాకరమన్నారు. అంతకుముందు గంజాయి స్మగ్లర్ల ప్రలోభాలకు లొంగి, అక్రమంలో భాగమయ్యారని, ఇపుడు అన్నింటికీ దూరంగా ఉంటున్నందున పంచాయతీ పరిధిలోని గిరిజనుల అభివృద్ధికి తగు చర్యలు చేపట్టాలని కోరారు.కార్యక్రమంలో ఎంపిటిసి వి.సాదురామ్, మహిళా పోలీస్ సుమలత, బుంగపుట్టు సచివాలయం సిబ్బంది, వార్డు, పీసా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘాట్‌రోడ్డులో ట్రాఫిక్ జాం

- రెండు భారీ లారీలు ఢీకొని, నిలిచిన రాకపోకలు

- ట్రాఫిక్‌లో చిక్కుకున్న అల్లూరి జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి - పాడేరు: పాడేరు ఘాట్‌రోడ్‌లోని జీసస్ కార్నర్ వద్ద మలుపులో ఎదురెదురుగా వచ్చిన రెండు భారీ వాహనాలు (12 చక్రాల లారీలు) ఢీకొని నిలిచిపోయాయి. దీంతో బుధవారం ఉదయం నాలుగు గంటల సేపు ట్రాఫిక్ స్తంభించింది. భారీ వాహనాలు కావడంతో చిన్న వాహనాలు సైతం రోడ్డు పక్క నుంచి వెళ్లడానికి అవకాశం లేకుండా పోయివిశాఖపట్నం వెళ్లే బస్సులు అటు నుంచి పాడేరు వచ్చే బస్సులు అక్కడ నిలిచిపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. అదే సమయంలో ఆ ప్రదేశానికి వచ్చిన అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ కూడా ట్రాఫిక్ లో చిక్కుకున్నారు. ఆయన అక్కడి నుంచి మరో వాహనంలో వెళ్లి విధులకు హాజరయ్యారు. భారీ వాహనాల రాకపోకలు పెరగడంతో పాడేరు ఘాట్‌లో తరచూ ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది.

పొంగి ప్రవహిస్తున్న చెరువూరు వాగు

రోగిని మోసుకుంటూ వాగు దాటించిన వైనం

ప్రజాశక్తి-చింతపల్లి : మండలంలోని చెరువూరు వాగు పొంగి ప్రవహిస్తుండడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో బలపం పంచాయతీ దిగజనభ గ్రామానికి చెందిన కుసంగి పొట్టమ్మ తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో ఆమెను కోరుకొండ ఆసుపత్రికి తరలించేందుకు గ్రామస్తులు ప్రాణాలను తెగించి రోగిని మోసుకుంటూ వాగు దాటించి ఆవలి ఒడ్డుకు చేర్చారు. అక్కడి నుంచి అంబులెన్స్ ద్వారా ఆమెను చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యాధికారులు తెలిపారు. వర్షాకాలంలో చెరువూరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయని, అత్యవసర సమయాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఈ వాగుపై శాశ్వత వంతెన నిర్మాణం చేయాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

జిసిసి ఉద్యోగి గోవింద్ మృతికి సంతాపం

ప్రజాశక్తి-చింతపల్లి : గిరిజన సహకార సంస్థ (జిసిసి) జూనియర్ అసిస్టెంట్ సంపరి గోవింద్ మృతి చెందడంతో ఆ సంస్థ అధికారులు, ఉద్యోగులు తీవ్ర సంతాపం తెలియజేశారు. మండల కేంద్రంలోని సాయినగర్ వీధిలో నివాసముంటున్న సంపరి గోవింద్ కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం ఉదయం 8 గంటలకు మృతి చెందారు. విషయం తెలుసుకున్న జిసిసి చింతపల్లి డివిజనల్ మేనేజర్ బుక్క వెంకటేష్, కొయ్యూరు బ్రాంచ్ మేనేజర్ సరమండ విజయ కుమార్, అకౌంటెంట్ మల్లేశ్వరరావు, చింతపల్లి గోడౌన్ ఇన్‌ఛార్జి ఎల్.రమణమూర్తి, పెట్రోల్ బంక్ ఇన్‌ఛార్జి బి.రామకృష్ణ, గ్యాస్ గొడౌన్ ఇన్‌ఛార్జి రమణమూర్తి, సేల్స్ మెన్లు, సిబ్బంది గోవింద్ మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. గోవింద కుటుంబానికి సానుభూతి తెలియజేసి అంతిమ సంస్కారాల నిమిత్తం రూ.25 వేలు అందజేశారు. గోవింద్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గోవిందుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. తండ్రి మరణంతో పెద్దదిక్కుని కోల్పోయామని కుమారులు శ్రీను, సాయి వాపోయారు. నిరుద్యోగులైన తమను సంస్థ ఆదుకోవాలని వారు కోరారు.

బరిస్టా కాఫీ తయారీపై గిరిజన యువతకు శిక్షణ

ప్రజాశక్తి -పాడేరు : అరకు ప్రాంతంలోని గిరిజన యువతకు బరిస్టా కాఫీ తయారీపై ఈ నెల 23 నుంచి 27 వరకు అరకు వైటీసీలో శిక్షణనివ్వనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్ కుమార్ వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు కాఫీ బోర్డు ఆఫ్ ఇండియాతో సంప్రదింపులు జరిపి శిక్షణ ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనిపై జిల్లాలో విస్తృత ప్రచారం నిర్వహించేందుకు సంబంధిత పోస్టర్‌ను జిల్లా ఎస్‌పి అమిత్ బర్దార్‌తో కలసి జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్ ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి వంజంగి పర్యటన సందర్భంగా స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వ్యవస్థాపక మార్గాలు, నిరుద్యోగ యువతకు స్థిరమైన ఉపాధి అవకాశాలను సష్టించడానికి కాఫీపై నైపుణ్య శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు ఎపిఎస్‌ఎస్‌డిసి కాఫీ బోర్డు సహకారంతో ఐదు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. శిక్షణతో గిరిజన యువతను పరిశ్రమ సంబంధిత నైపుణ్యాలతో శక్తివంతం చేయొచ్చన్నారు. కాఫీ రంగంలో భవిష్యత్తును నిర్మించుకునే అవకాశం లభిస్తుందన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి పి.రోహిణి, ట్రైబల్ వెల్ఫేర్ ఉపసంచాలకులు పిబి.కె. ప్రమీల ఉన్నారు.

సమస్య పరిష్కరించిన జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి - రంపచోడవరం : ఆశ్రమ పాఠశాలలో చదువుతూ మృతి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి విడేలా వివేకానందరెడ్డి మూడు రోజులుగా రంపచోడవరం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉండడం ఐటిడిఏ పిఓ, డిప్యూటీ డైరెక్టర్ సరి అయిన బాధ్యత తీసుకుపోవడం వలన గిరిజన సంఘాలు, రైతు కూలీ సంఘాలు, గత రెండు రోజులుగా పెద్దఎత్తున ఆందోళన చేపట్టడం జరిగింది, అయినప్పటికీ ఐటిడిఎ పిఒ ఆసుపత్రికి వచ్చి పరామర్శించలేదు. ఆసుపత్రికి వచ్చిన డిప్యూటీ డైరెక్టర్ బాధ్యతారహితంగా ప్రవర్తించడంతో ఆదివాసీ చైతన్య వేదిక అధ్యక్షులు వెదుర్ల లచ్చిరెడ్డి బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌తో ఫోన్లో మాట్లాడారు. స్పందించిన కలెక్టర్ మృతి చెందిన కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం ఇవ్వటానికి హామీ ఇచ్చారు. కలెక్టర్ చొరవతో గత మూడు రోజులుగా చేస్తున్న ఆందోళన విరమించారు. పల్లాల లచ్చిరెడ్డి ఎఐకెఎంఎస్ పల్లాల అనసూయ, సాధలా చిలకమ్మ, పిఓడబ్ల్యు, బాలు అక్కసా హ్యూమన్‌రైట్స్‌వాచ్ ఎపి అధ్యక్షులు, మద్దిటి అంజిరెడ్డి భారత ఆదివాసీ పార్టీ రంపచోడవరం నియోజవర్గ ఇన్‌చార్జి కత్రం రామదాసు దొర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎఒ చక్రధర్

సేంద్రియ సాగుపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి -రాజఒమ్మంగి : రైతులు సేంద్రియ సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయాధికారి చక్రధర్ అన్నారు. బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నెల్లిమెట్ల, మారేడుబాక గ్రామాల్లో రైతు సదస్సు, పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరూ సేంద్రియ సాగు చేపట్టాలని తద్వారా ఆరోగ్యకరమైన ఉత్పత్తులు పొందడానికి అవకాశం ఉంటుందని తద్వారా ఆరోగ్యాన్ని పెంపొందించుకోడానికి వీలు అవుతుందని తెలిపారు. ఆరోగ్యకరమైన నేలను పర్యావరణ వ్యవస్థలను కాపాడుకోడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రతి రైతు వేసిన అన్ని పంటలకూ పంట నమోదు చేయించుకోవాలని, 90శాతం సబ్సిడీపై వరి విత్తనాలు పొందాలన్నా, పంట రుణాలు తీసుకోవాలన్నా, ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం విక్రయించాలన్నా తప్పకుండా పంట నమోదై ఉండాలన్నారు. వ్యవసాయ యంత్రాలు కావాల్సిన రైతులు గ్రామ వ్యవసాయ సహాయకునికి తమ పేర్లు అందించాలన్నారు. పీసా ఉపసర్పంచ్ సూరిబాబు, మారేడుబాక సర్పంచ్ ఆదిరాజు, మారేడుబాక పీసా ఉప సర్పంచ్ నరసింహ, రైతులు పాల్గొన్నారు.




యాంటీ లార్వా మందు పిచికారీ చేయిస్తున్న ఎంపిటిసి వంశీ

డ్రైయినేజీల్లో యాంటీ లార్వా పిచికారీ

ప్రజాశక్తి - రంపచోడవరం : తామరపల్లి పంచాయతీలోని గోపవరంలో డ్రైనేజీల్లో యాంటీ లార్వా మందు పిచికారి చేయించడం జరిగిందని ఎంపిటిసి కుంజం వంశీ ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి భోజనశాల ఏ విధంగా ఉందో పరిశీలించారు. పిల్లలకు గోరువెచ్చని నీళ్లు ఇవ్వాలని సూచించారు వార్డ్ మెంబెర్ గంగా, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రామసిత, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీను, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళా పక్షపాతి కూటమి ప్రభుత్వం

ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: కూటమి ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలను చిత్తశుద్ధితో అమలు చేస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్‌పర్సన్ ఎం.శిరీషదేవి,నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు ఎం.విజయ్‌భాస్కర్ అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయ ప్రాంగణంలో స్త్రీశక్తి పథకం విజయోత్సవ సభను మండల అధ్యక్ష, కార్యదర్శులు పెద్దిరాజు, ఎం.డింబకేశవ్ అధ్యకతన నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు తక్కువ కాలంలో పారదర్శకంగా అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. పార్టీ పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాస్‌యాదవ్ తదితరులు మాట్లాడారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ లోతా లక్ష్మణరావు, మండల పార్టీ నాయకులు గొల్లపూడి పెద్దిరాజు, క్లస్టర్ ఇంచార్జి ముప్పన కేశవ్, బిజెపి రాష్ట్ర కార్యదర్శి స్వప్నకుమారి, మాజీ సొసైటీ అధ్యక్షులు గణజాల తాతారావ్, ఎంపిటిసి సత్తిబాబు, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు ముప్పన సావిత్రి, ఎఎంసి డైరెక్టర్లు మాణిక్యం అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు ఇవ్వాలి

ప్రజాశక్తి - రంపచోడవరం : రాష్ట్రంలోని రిజర్వ్‌ఫారెస్ట్ మీదుగా వెళ్లవలసిన రహదారులకు అటవీశాఖ అధికారులు అనుమతులు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అటవీశాఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్‌కు రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి వెంకటేశ్వరరావు వినతిపత్రంలో కోరారు. బుధవారం అమరావతి సెక్రటేరియట్‌లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏజెన్సీలో అటవీశాఖ అనుమతులు లేక పలు రోడ్లు నిలిచిపోయాయన్నారు. ఈ రోడ్లకు సంబంధించిన వివరాలను మంత్రికి అందించారు. అటవీశాఖ అభ్యంతరాలు లేకుండా చేసి గిరిజన ప్రాంతాల్లో రహదారి నిర్మాణాలు పూర్తయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.



పవన్‌కళ్యాణ్‌కు వివరాలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి



ఉత్తరప్రదేశ్ జట్టుతో తలపడుతున్న ఎపి జట్టు

కబడ్డీలో సెమీఫైనల్‌కు ఎపి ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ జట్టు

ప్రజాశక్తి-సీలేరు: జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో ఎపి ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ జట్టు అత్యంత ప్రతిభ కనబరిచి సెమీఫైనల్‌కి చేరుకుందని ఎపి ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ జట్టు మేనేజర్ సిహెచ్.సురేష్ వెల్లడించారు. ఆయన స్థానిక విలేకరులతో బుధవారం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం యాదాద్రిగుట్టలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో బుధవారం ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ జట్టు ఉత్తర ప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ జట్టు తలపడగా ఎపి జట్టు 35 పాయింట్లు సాధించి సెమీఫైనల్స్‌కు చేరుకుందన్నారు. ఉత్తరప్రదేశ్ జట్టు కేవలం 3 పాయింట్లకే పరిమితమైందని పేర్కొన్నారు. జట్టు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న ఎపి జెన్కో సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో ఎడిఇగా పనిచేస్తున్న శ్రీనివాసరావు బెస్ట్ డిఫెన్స్‌గా తన ప్రతిభను కనబరిచారనిజట్టు మేనేజర్ సిహెచ్ సురేష్ తెలిపారు.

విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్ నెంబర్లు ఉపాధ్యాయులకు తెలపాలి

ప్రజాశక్తి- రంపచోడవరం : ఏజెన్సీలో ఆశ్రమ పాఠశాలలు, ఏకలవ్య, కస్తూరిబా, గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు వారి ఫోను నెంబర్లు పాఠశాలల్లో హెచ్ఎంలకు తెలియజేయాలని రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం సూచించారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి పనిచేస్తున్న మూడు ఫోను నెంబర్లు స్వీకరించి ఎప్పటికప్పుడు విద్యార్థుల యోగ క్షేమాలు తెలియజేయా లన్నారు. అన్ని పాఠశాలలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామన్నారు.

గంజాయి అక్రమ రవాణా నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి-చింతపల్లి : గంజాయి అక్రమ రవాణా నిర్మూలన కోసం ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో చింతపల్లి మండలంలో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ డి.నాగార్జున, ఆదివాసీ గిరిజన డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంపరి రమణ మాట్లాడుతూ, వాహనాల్లో లగేజ్ తీసుకునే ముందు పూర్తిగా తనిఖీ చేయాలని, అపరిచితులకు వాహనాలు అద్దెకు ఇవ్వకూడదని హెచ్చరించారు. లేకపోతే వాహనాలు సీజ్ కావడం, జైలు శిక్షలు అనివార్యం అవుతాయని పేర్కొన్నారు. గంజాయి రవాణా వలన యువత డ్రగ్స్ బారిన పడి జీవితాలు నాశనమవుతున్నాయని తెలిపారు. ఎన్‌డిపిఎస్ చట్టం ప్రకారం కఠిన శిక్షలు తప్పవన్నారు. గంజాయికి సంబంధించిన సమాచారం ఉంటే 1972 టోల్ ఫ్రీ నెంబర్‌కి తెలియజేయాలని సూచించారు. అనంతరం "డ్రగ్స్ వద్దు బ్రో" డ్రైవర్ల చేత ప్రతిజ్ఞ చేయించారు. వాహనాలపై ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ స్టిక్కర్లు అతికించారు.



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

పలువురికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - జికేవీధి : మండలంలోని బొంతువలసలో ఫెయిత్ మినిస్ట్రీ మెగా మెడికల్ క్యాంప్ బుధవారం నిర్వహించారు. సుమారు 100 మంది గిరిజనులకు వైద్యసేవలు అందించి, ఆహారం పెట్టి, వస్త్రదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సిహెచ్ సూర్యనారాయణ ఫెయిత్ మినిస్ట్రీ ఫౌండర్స్ మాత సుధీర్, జోసెఫ్, శీలం శైలస్ తదితరులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన బాలామృతం ప్యాకెట్ల పంపిణీ

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం గుమ్మరేవుల పంచాయతీ మినిఅంగన్‌వాడి కేంద్రంలో కాలం చెల్లిన బాలామతం ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నారని కొమురెల్లి మాజీ సర్పంచ్ బాబురావు ఆరోపించారు. మాదిగమల్లు మెయిన్ అంగన్వాడి కేంద్రం నుంచి మినీ అంగన్వాడి కేంద్రానికి బాలామతం ఇచ్చినట్లు నిర్వాహకులు తెలిపారని పేర్కొన్నారు. ఐసిడిఎస్ పిఒ, అధికారులు స్పందించి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

5న దామోదరం సంజీవయ్య లా వర్సిటీ స్నాతకోత్సవం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయం సంయుక్త (8వ, 9వ, 10వ, 11వ, 12వ) స్నాతకోత్సవం ఈ నెల 5న జరుగనుందని వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య డి.సూర్యప్రకాశరావు తెలిపారు. బుధవారం డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు బీచ్‌రోడ్డులోని నోవోటెల్ హోటల్‌లో స్నాతకోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



రైతులకు యూరియా అందిస్తున్న ఎఒ రత్నప్రభ

రైతులకు యూరియా, డిఎపి పంపిణీ

ప్రజాశక్తి -చింతూరు : రైతు సేవాకేంద్రం ద్వారా బుధవారం వ్యవసాయ శాఖాధికారి రత్నప్రభ రైతులకు యూరియా, డిఎపి అందజేశారు. చింతూరు రైతుసేవాకేంద్రం నుంచి 10 టన్నుల యూరియా చదలవాడ నుండి 10 టన్నులు మొత్తం 20 టన్నుల యూరియా ఇప్పటికే రైతులు అందజేసినట్లు రత్నప్రభ తెలిపారు. మరో రెండు రోజుల్లో ఏడుగురాళ్లపల్లి రైతుసేవాకేంద్రం నుంచి 25 టన్నుల యూరియా వస్తుందని ఆమె తెలిపారు. మొత్తం 11 కేంద్రాల ద్వారా 18 పంచాయతీల రైతులకు అందజేస్తామనితెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఎండి జహంగీర్, ఎంపిపి అమల, సర్పంచ్ కారం కన్నారావు, వ్యవసాయ మార్కెట్ కమిటి సభ్యుడు పసుపులేటి సాల్మన్ రాజు, జనసేన మండలాధ్యక్షులు మడివి రాజు, బిజెపి మండల అధ్యక్షులు బంగారు లక్ష్మణ్, సుప్రజ పాల్గొన్నారు.